క్లుప్తంగా

గిరిజనులకు దుస్తుల పంపిణీ



బలపాలతిప్ప గూడెంలో గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని చెంచు గూడెల్లోని గిరిజనులకు శనివారం సంఘమిత్ర సేవాసమితి నంద్యాల వారు దుస్తులు పంపిణీ చేశారు. సంఘమిత్ర సేవా సమితి అధ్యక్షుడు కే.నాగ సుబ్బారెడ్డి, కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని జనాలగూడెం, బలపాలతిప్ప, పాతమాడుగుల, ఎర్రమఠం గూడెలలో గిరిజనులకు దుప్పట్లు, చీరలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణయ్య గౌడ్, గోకవరం ఆవాస ప్రముఖ్ రామకృష్ణ, జానాల బిచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలే ధ్యేయం



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ నాగభూషన్

పాములపాడు: ప్రజల శాంతి భద్రతలే ధ్యేయంగా విధులు నిర్వర్తించాలని ఆత్మకూరు సీఐ నాగభూషణ్ అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సాధారణ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డుల, కేసు ఫైల్స్ పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతల పట్ల తీసుకుంటున్న చర్యలు, రాత్రి వేళల్లో గస్తీ గురించి ఆరా తీశారు. నాటుసారా, బెల్టు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్‌ఐ అశోక్ ఉన్నారు.

బైక్ దహనం

పాములపాడు: మండలంలోని బానుముక్కల మలుపు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పల్సర్ బైక్‌ను దహనం చేసిన ఘటన శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు బానుముక్కల గ్రామానికి చెందిన రామోజీనాయక్ ఆంజనేయ స్వామి మాల ధరించాడు. బానుముక్కల మలుపు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించుకొని రాత్రి పక్కనే ఉన్న గదిలో నిద్రించాడు. అయితే తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను కాల్చివేశారు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

లింగ వివక్ష చూపడం నేరం

కొత్తపల్లి: సమాజంలో ఆడ,మగ ఇద్దరూ సమానమేనని, లింగ వివక్షను చూపడం నేరమని ఏపీఎం పుల్లయ్య అన్నారు. శనివారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీ షర్ప్ నుంచి గ్రామాల జల సంఘం కమిటీల ఏర్పాటుపై ఉన్నతాధికారులు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం లింగవివక్ష, జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా బాల్య వివాహలకు వ్యతిరేకంగా వైకేపీ కార్యాలయం నుంచి బస్టాండ్‌వద్ద గాంధీసెంటర్‌వరకు మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఓబీలు చెన్నమ్మ, జ్ఞానమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాలలో ర్యాలీ

పగిడ్యాల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం లింగవివక్షపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ వెంకటరమణ, సూపరింటెండెంట్ నాగరాజరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన విగ్రహం

పగిడ్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠ మహేశ్వర స్వామి (కాటమయ్య) విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠా, కళావాహనలు కార్యక్రమాలను పురోహితులు జగదీశ్వరయ్య శాస్త్రోక్తంగా చేపట్టారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

టెండర్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సుమారు రూ.125కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు పిలువగా.. నవంబరు 30న టెండర్లు ఓపెన్ చేశారు. పలు సంస్థలకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నారు. టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేసిన అధికారులు గత రెండు రోజులుగా ఆయా టెండర్లలలో పాల్గొన్న కాంట్రాక్టర్ల కు సంబంధించిన పలు ఫైళ్లను పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలన మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. రూ.75కోట్లతో నిర్మించే క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులకు 8 కంపెనీలు పోటీ పడ్డాయి. రూ.35కోట్లతో నిర్మించే సాలు మండపాల నిర్మాణ పనులకు 10మంది కంపెనీలు టెండర్లు వేశాయి. దోర్నాల వద్ద నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండప నిర్మాణ పనులకు ఐదుగురు కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. పరిశీలన అనంతరం రివర్స్ టెండరింగ్ చేపట్టి తదుపరి ప్రైస్‌బిడ్ ఓపెన్ చేయనున్నారు.

రైతన్నకు 'భరోసా'

- అర్హత ఉన్న ప్రతి రైతుకూ 'రైతు భరోసా' మంజూరు
- ఐదో ఏడాది రెండో విడత నగదు జమ
- ఆత్మకూరు డివిజన్ పరిధిలో 71,356 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



వడ్లరామాపురం ఆర్బీకేలో సీఎం ప్రసంగాన్ని తిలకిస్తున్న ఏడీఏ, రైతులు (ఫైల్)

ఆత్మకూరు: పాదయాత్ర సమయంలో రైతన్నల కష్టాలను, ఇబ్బందులను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం పంట సాగు కోసం ఖరీఫ్, రబీ సమయాల్లో ప్రతి అన్నదాతకు పెట్టుబడి సాయంగా ఏడాదికి 13,500 చొప్పున రైతు భరోసా– పీఎం కిసాన్ పేరుతో అందిస్తున్నారు. ఈ మేరకు నగదును వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. ఐదో ఏడాదికి సంబంధించి రెండో వడతగా రూ.4వేలను నవంబర్ 7వ తేదీన సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి ముఖ్యమంత్రి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రైతుకు రూ.4వేలు..

ఈ ఏడాది రెండో వడత నగదు సాయాన్ని శ్రీశైలం నియోజకవర్గంలో 29,053 మంది రైతులకు రూ.11,62,12,000 నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో జమ చేశారు. ఇదే తోవలో నందికొట్కూరు నియోజకవర్గంలో 42,303 మంది రైతులకు రూ.16,92,12,000 నగదు లబ్ధి చేకూరింది. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో 8,615, వెలుగోడు 6,357, బండి ఆత్మకూరు 9,137, మహానంది 4,944 మంది రైతులకు , నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు లో 6,514, పాములపాడు 8,056 , పగిడ్యాల 3,748, మిడుతూరు 9,422, జూపాడుబంగ్లా 7,703 ,కొత్తపల్లి 6,860 మంది రైతులకు నేరుగా రూ.4 వేల చొప్పున నగదు బదిలీ అయ్యింది.

రైతులకు ఎంతో ఊరట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అందిస్తున్న రైతు భరోసా పెట్టుబడి సాయం ఎంతో ఊరటనిస్తోంది. ప్రస్తుతం రూ.4 వేలు మంజూరు అయ్యాయి. చేసి ఇలా ఏడాది కి రూ.13,500 చొప్పున అందజేస్తున్నారు. ఇది చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– వరాల మాలిక్, ఆత్మకూరు

కౌలు రైతులకు కూడా ఇచ్చారు



రైతులతో పాటు కౌలు రైతులకు కూడా చేదోడుగా ఉండేందుకు రైతు భరోసాను మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటాం. గతంలో ఏ ప్రభుత్వమూ కౌలురైతులను పట్టించుకోలేదు. కౌలు రైతులకు కూడా నగదు సాయం అందించడం సంతోషం.

– మహమ్మద్ రఫీ, ఆత్మకూరు

అర్హత ఉన్న ప్రతి రైతుకు నగదు మంజూరు



ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని రైతులకు అర్హత ఉంటే చాలు రైతు భరోసా కింద రైతుల పేర్లను నమోదు చేస్తున్నాం. ఈ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రబీ, ఖరీఫ్ సీజన్‌లో రూ.13,500 చొప్పున ప్రభుత్వం నిధులు నేరుగా రైతన్నల ఖాతాల్లో జమచేస్తుంది. ప్రస్తుతం రైతు భరోసా సొమ్ము రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే తమ వద్దకు దరఖాస్తులు తీసుకువస్తే పేర్లను నమోదు చేస్తాం.

–ఆంజనేయులు ,ఏడీఏ, ఆత్మకూరు

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోండి



రింగ్‌రోడ్డును పరిశీలిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓ డి. పెద్దిరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పలు ప్రదేశాలను పరిశీలించారు. రోడ్డు భవనాల శాఖ అతిథి గృహ కూడలి, ఘంటామఠం కూడలి, విభూతిమఠం కూడలి, వలయ రహదారి, పాతాళగంగ రోడ్డు, పాతాళగంగ మెట్ల మార్గం, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ తదితర ప్రదేశాల్లో పర్యటించారు. ఈఓ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రోడ్డు భవనాల శాఖ అతిథిగృహం కూడలి వద్ద వీలైనంత మేరకు రహదారిని ఇరువైపులా విస్తరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా రుద్రాక్షమఠం, విభూతిమఠం, వద్ద గల కూడళ్ల రహదారిని విస్తరణకు, మఠాల ప్రాంగణం ముందు గార్డెనింగ్ చేపట్టాలని సూచించారు. క్షేత్రపరిధిలో రహదారికి ఇరువైపులా ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేట్టాలన్నారు.కూడళ్ల వద్ద ఆయా రహదారులు తెలిసే విధంగా సూచిక బోర్డులు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం మై రోడ్డు భవనాల అతిథిగృహం సమీప ప్రాంతంలో అనువైన చోట జల్లుస్నానానికి ఏర్పాటు చేయాలన్నారు. మల్లమ్మ కన్నీరు ఎదురుగా కూడలివద్ద ట్రాఫిక్ ఐలెండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రపరిధిలో మరిన్ని చోట్ల వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈఈలు వి.రామకృష్ణ, జి.మురళీధరరెడ్డి, సివిల్ విభాగం డీఈ చంద్రశేఖర్‌శాస్త్రి, ఎలక్ట్రికల్ డీఈ పి.వి సుబ్బారెడ్డి, పర్యవేక్షకులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఆధారాలతో మార్పులు, చేర్పులు చేయండి



మండ్లెంలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎం దాసు

జూపాడుబంగ్లా: పక్కా ఆధారాలుంటేనే ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు బీఎల్‌ఓలకు సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ బీఎల్‌ఓలు ఉన్నారా అంటూ ఆరాతీశారు. బీఎల్‌ఓలు ఈశ్వరయ్య, మేరీ, వేణుగోపాల్, సందీప్ చేపట్టిన ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్‌పుల్లయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై ఆగ్రహం

పగిడ్యాల: శనివారం మండలంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో సూపర్‌విజన్ చేసేందుకు నియమింపబడిన సీనియర్ అసిస్టెంట్ గైర్హాజరు కావడంపై ఆర్డీఓ దాసు తహసీల్దార్ భారతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మాపురం 103, 104, నెహ్రూనగర్ 3, 4, 5 పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ సూపర్‌విజన్ అధికారిగా నియమింపబడిన సీనియర్ అసిస్టెంట్ విధులకు ఎందుకు హాజరు కాలేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

ఓటర్ల నమోదు పకడ్బందీగా ఉండాలి

పాములపాడు: కొత్త ఓటర్ల నమోదు పకడ్బందీగా ఉండాలని ఆర్డీఓ దాసు అన్నారు. శనివారం మండలంలోని పోలింగ్ బూత్‌లను సందర్శించారు. మండలంలోని వేంపెంట, రుద్రవరం, కంబాలపల్లి, యర్రగూడూరు గ్రామా ల్లో పర్యటించారు. అలాగే తహసీల్దార్ రత్నరాధిక జూటూరు, రుద్రవరం గ్రామాల్లో ఓటరు నమోదును పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు: మండలంలోని శ్రీపతిరావు పేట, ఇందిరేశ్వరం, ఎస్ఎన్‌తండా, అమలాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ ఉమాదేవి పరిశీలించారు.

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్ : పట్టణంతోపాటు మండలపరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ రాజశేఖర్‌బాబు తనిఖీ చేశారు.

మహానంది: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జనార్దన్ శెట్టి సూచించారు. మండలంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

ఎమ్మెల్యే శిల్పాపై విమర్శలు చేస్తే సహించం



మాట్లాడుతున్న మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు యూనుస్, నాయకులు

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై టీడీపీ నేతలు చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు యూనుస్ హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. యూనుస్ మాట్లాడుతూ..ఇటీవల టీడీపీ నాయకుడు శిరివెళ్ల రజాక్ ఎమ్మెల్యే శిల్పాపై చౌకబారు విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రజాక్ ఏ పార్టీకి చెందిన వాడో తెలియడం లేదని.. ఒక రోజు కర్నూలులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ఇంటి వద్ద, మరో రోజు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఇంటి వద్ద, ఇంకోరోజు మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ఇంటి వద్ద దర్శనమిస్తాడన్నారు. వెలుగోడుకు వచ్చి టీడీపీ అంటాడని ఎద్దేవా చేశారు. విలువలతో కూడిన ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి రజాక్‌కు లేదన్నారు.

మైనారిటీలకు పదవులు శిల్పా ఘనతే

వెలుగోడు పట్టణంలో మైనారిటీ మహిళకు స్టేట్ డైరెక్టర్ పదవి ఇచ్చిన ఘనత శిల్పాకే దక్కుతుందని యూనుస్ అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంతో మంది మైనారిటీలు డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులుగా ఉన్నారని చెప్పారు. టీడీపీ హయాంలో మైనారిటీలకు రూ.204 కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.26 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. ఎమ్మెల్యే శిల్పాపై అర్థరహిత విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో మైనారిటీ నాయకులు అమీర్ అలీఖాన్, జబివుల్లా, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, ఏజాజ్, నూర్ అహ్మద్, మహ్మద్ ఖాష్, కలిముల్లా ఖాష్, రమణ, మునీర్, దస్తగిరి, షబ్బీర్, షమీవుల్లా, సూర్యనారాయణ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బారి నుంచి పంటలను కాపాడుకోండి

వెలుగోడు/కొత్తపల్లి: తుపాన్ ప్రభావం ఉందని సమాచారం మేరకు రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వెలుగోడు,కొత్తపల్లి ఏఓలు పవన్ కుమార్, మహేష్ సూచించారు. ఈనెల 4,5 తేదీల్లో వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్‌ను ఉపయోగించి కోయాలన్నారు. వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు. తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుకోవాలన్నారు. తుపాను తరువాత ధాన్యమును ఆరబెట్టుకునే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా వరి పంట కోసి చేనులో వుండే పన్నలను కట్టలు కట్టి, కుప్పలు పోసి వర్షంలో తడవకుండా చూసుకోవాలని సూచించారు. తడిసిన పన్నలలో మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తి, మిరప పంటల చేనులలో వర్షపు నీరు నిలవ కుండా చూసుకోవాలని సూచించారు.

కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ బుచ్చయ్య ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ విజ్ఞానం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ విభాగపు అధ్యాపకురాలు డా.ఎమ్‌పద్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

పాములపాడు: అంగన్‌వాడీ వర్కర్లకు తెలంగాణ రాష్ట్రం కన్నా మిన్నగా వేతనాలు ఇవ్వాలని ఆ సంఘం ప్రాజెక్టు కార్యదర్శి శివలక్ష్మమ్మ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీక్రిష్ణ, సర్పంచు మేకల భాగ్యమ్మకు, సచివాలయంలో వినతి పత్రాలు అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. నాగబద్దమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి..?

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం అంచె వద్ద గురుకుల పాఠశాల వెనుక పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఉమ్మడి కర్నూలు జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కొద్ది కాలంగా సాగుతున్న పేకాట వ్యవహారంపై కొందరు జిల్లా ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు పోలీసులు మూకుమ్మడిగా దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి కొంత నగదు రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే దాదాపు 15 మంది పేకాటరాయుళ్లు ఉన్నట్లు వినికిడి. ఈ విషయమై ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జునను సంప్రదించగా విచారణ చేస్తున్నామని చెప్పారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి శనివారం జరిగే అన్నదాన కార్యక్రమానికి మాజీ వార్డు కౌన్సిలర్ మారబోతుల స్వామి, మాజీ వైస్ చైర్మన్ రామలక్ష్మమ్మ దంపతులు రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. దేవాలయంలో శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటి సభ్యులు వారిని దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రామయ్య, శ్రీహరి, జక్కామురళీ, గురుస్వామి, వెంకటరెడ్డి, జగదీష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



సున్నిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: బడిఈడు పిల్లలను బడిలోనే ఉండేల చూడాలని ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లా సూ చించారు. శనివారం మండలంలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లి, పాలెంచెరువు, నందికుంట గ్రామ సచివాలయాల్లో గ్రామవలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మిషన్ 100 శాతం కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులు డ్రాపవుట్ లేకుండా గ్రామ వలంటీర్లు సహకారం అందించాలన్నారు. ఏ వయసు పిల్లలు ఆయా తరగతుల్లో ఉండేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

శ్రీశైలంప్రాజెక్ట్: బడి ఈడు పిల్లలు పాఠశాలలో చదువుకోవాలని వారిని వెట్టిచాకిరికి, ఇతర పనులకు ఉపయోగించరాదని మండల విద్యాధికారులు సక్రూనాయక్, కలిముల్లా అన్నారు. శనివారం సున్నిపెంట గ్రామంలో బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. సున్నిపెంట బస్టాండ్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో నమోదుపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఈఆర్ సర్వేపై త్వరలో కేంద్ర బృందం వెరిఫికేషన్ ఉన్న నేపథ్యంలో ముందస్తు సర్వేపై (పీఆర్‌ఈ సర్వే) జిల్లా అధికారులను మండల స్పెషల్ అధికారులుగా నియమించామన్నారు. నంద్యాల, డోన్, ఆత్మకూరు తదితర వలరనబుల్ ప్రాంతాల్లో అధిక మంది విద్యార్థులు డ్రాపవుట్స్ ఉన్నట్లు తెలుస్తోందని, అధికారులు వెంటనే స్పందించాలని చెప్పారు. ఎంపీడీఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంల బృందాలు వలంటీర్లను అనుసంధానం చేసుకొని పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, భూగర్భజల శాఖ డీడీ రఘురాం, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన పింఛన్ల పంపిణీ



డోన్‌లో శివశంకర్‌కు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సురేష్

జూపాడుబంగ్లా: రెండో రోజైన శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మ, దివ్యాంగులకు పింఛన్ల నగదు పంపిణీ చేశారు. డిసెంబర్ మాసానికిగాను మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 5,102 పింఛన్లు మంజూరు కాగా శనివారం సాయంత్రం 6గంటల ప్రాంతానికి 4,806 పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేసి జిల్లాలో మూడోస్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ సూర్యహాన్ తెలిపారు.

డోన్ వెళ్లి పింఛన్ పంపిణీ

వెలుగోడు: పట్టణానికి చెందిన దివ్యాంగుడు ముండ్లపాటి శివశంకర్ ప్రమాదవశాత్తు గాయపడి నడవలేని స్థితిలో డోన్ పట్టణంలో బంధువుల వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న వార్డు వలంటీర్ సురేష్ శనివారం డోన్‌కు వెళ్లి పింఛన్ అందించారు. సందర్భంగా వలంటీర్‌కు శివశంకర్ కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాలు వెలికి తీసేందుకే క్రీడా పోటీలు



వ్యాయామ ఉపాధ్యాయులతో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... క్రీడలపై ఆసక్తి ఉండి పదిహేనేళ్లు నిండిన యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను పకడ్బందీగా జరపాలని సూచించారు. పట్టణ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు యువతను తీర్చిదిద్దాలని కోరారు. అలాగే మున్సిపల్ కమిషనర్ కిశోర్ స్థానిక జైకిసాన్ పార్కులో క్రీడల రిజిస్ట్రేషన్‌పై వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో ఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, కౌన్సిలర్లు చాంద్‌బాషా, చిన్నరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు డోరతి, జెసింత, వైఎస్సార్‌సీపీ నాయకులు రజినీకుమార్‌రెడ్డి, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

కొత్తపల్లి: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామాల్లో వేగవంతం చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శనివారం మండలంలోని ఎర్రమఠం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, గ్రామవలంటీర్లతో సమావేశమయ్యారు. ప్రతి గ్రామ వలంటీర్ తప్పకుండా క్రీడాకారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించాలి



ప్రజలకు సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

పాములపాడు: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోవైఎస్సార్‌సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తుమ్మలూరు, మజరా క్రిష్ణారావుపేట గ్రామాల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు వరప్రసాదరావుతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ జెండాలు పలు గృహాలపై ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో చెలిమిల్ల ఎంపీటీసీ సురేష్, సొసైటీ చైర్మన్ చౌడయ్య, మాజీ చైర్మన్ ఎల్‌వీ.రమణారెడ్డి, మాజీ సర్పంచు బాలునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మధుసూదన్‌రావు, జబ్బార్, ప్రభాకర్, ఉశేన్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తుల కోసం శివసదన్ ఆశ్రమం

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి విచ్చేసే సామాన్య భక్తులకు ధ్యాన యోగమందిరాలతో పాటు మౌలిక వసతులను కల్పించేందుకు శివసదన్ ఆశ్రమ నిర్మాణం చేపడుతున్నట్లు తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి తెలిపారు. శనివారం క్షేత్రపరిధిలో గల రుద్రపార్క్ సమీపంలో శివసదన్ ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేశారు. విజయవాడ, గుంటూరుకు చెందిన హరి వెంకట సతీష్, ఉమారాణి దంపతుల ఆధ్వర్యంలో గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో రూ.1.50కోట్ల దేవదాయ, ధర్మదాయశాఖ నిధులతో నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామివారి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆదివారం ఉదయం దేవతా మూర్తుల విగ్రహాల గ్రామోత్సవం, 4న ఉదయం అకల్మశహోమం, రక్షాబంధన, బింబస్థాపనం కార్యక్రమాలతో పాటు సాయంత్రం కుంభస్థాపన, కుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, కళాపకర్షణ వంటి పలు విశేషపూజలు నిర్వహిస్తారు. 5న మహాశాంతి అభిషేకం, 6న ఆలయ గర్భగుడిలో స్వామివార్ల విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీసీతారాముల వారి కళ్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ అగు కె.సత్యనారాయణ రెడ్డి, తండ్రి కె.సి.కృష్ణా రెడ్డి, ఇ.నెం:40/790-8-1, నెహ్రూనగర్, కర్నూలు సిటీ, కర్నూలు జిల్లా వారి తరుపున తెలియజేయడం ఏమనగా.. నా క్లయింట్ క్రింది షెడ్యూల్ దాఖల ప్లాటును కె.రామానుజం గారి నుండి తేది:27-5-2009 నాడు రిజిస్టర్ డాక్యుమెంట్ నెం.3279/2009 ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లయింట్ అగు కె.సత్యనారాయణ రెడ్డి గారు తేది:03-4-2021 నాడు వడ్డెమాన్ గ్రామం నుండి బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి బైక్ మీద పోవుచున్నప్పుడు మార్గ మధ్యలో సదరు ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ నెం.3279/2009 తేది:27-5-2009 పోయినది. సదరు ఒరిజినల్ డాక్యుమెంటు గురించి బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ నందు కంప్లయింట్ ఇవ్వడం జరిగినది. సదరు బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ వారు తేది:01-5-2021 నాడు సదరు డాక్యుమెంట్ ట్రేసవుట్ కాలేదు అని సర్టిఫికెట్ ఇచ్చినారు. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.3279/2009 తేది:27-5-2009 ఎవరికైనా దొరికినచో నన్ను గాని నా క్లయింట్‌ను గాని సంప్రదించగలరు. అట్టి వారికి తగిన పారితోషికం ఇవ్వబడునని తెలియజేయడమైనది. అలాగే క్రింది షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించి ఎవరికైన నను ఎలాంటి హక్కు, అధికారములు వున్నచో ఈ ప్రకటన తేది నుండి పది రోజుల లోపల సరియైన ఆధారములతో నన్ను సంప్రదించగలరు. తరువాత ఎలాంటి అభ్యంతరములు వచ్చినను చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కర్నూలు డి., కర్నూలు సబ్.డి., కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా నెం.44వ వార్డు, కర్నూలు గ్రామ సర్వే నెం.6/3, 6/7, 6/8, & 6/10వలకు భూమి నందలి నెం.44/16కు ఇంటి నమీపం ఇండ్ల ప్లాట్లకు గాను సంచాలకులు పట్టణ మరియు ప్రణాళికా విభాగము, హైదరాబాదు వారిచే యల్.పి.నెం.60/96గా అప్రూవల్ కాబడిన ప్లాను దాఖలా ప్లాట్ల పైకి నెం.4ఎ రు ప్లాటు స్థలమునకు **చెక్కుబంది మరియు కొలతలు : చెక్కుబంది : తూర్పు:** ఇతరుల భూమి, **పడమర:** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** నెం.4 రు ప్లాటు స్థలము, **దక్షిణం:** నెం 4బి రు ప్లాటు స్థలము. ఈ నలుదిశలకు లోనైన ప్లాటునకు కొలతలు: తూ॥ప॥60అ॥(18.2880మీ॥), ఉ॥ద॥20అ॥(6.0960మీ॥) విస్తీర్ణము 1200 చ॥అ॥ లేక 133.33 చ॥గజాలు.

టి.నారాయణ రెడ్డి, BA, LLB,
అడ్వకేట్, సెల్: 93938 30666

